ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
నారాయణపేట
జిల్లా వార్తలు
సోమవారం 3 ఫిబ్రవరి 2025
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 33.0 | కనిష్ఠం : 19.0



భలాన్‌పల్లిలో సూర్యకాంతులు

- నేటి నుంచి సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు
- రాష్ట్రంలోనే తాడూరులో ఏకైక దేవాలయం

5



పంచాయతీ ఎన్నికలు

రెండు విడతల్లో?

- ఫిబ్రవరి చివరలో ముహూర్తం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే నోడల్ అధికారుల నియామకం
- చివరి దశలో బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్
- మహబూబ్‌నగర్ జిల్లాలో 441 నుంచి 422కు తగ్గిన గ్రామ పంచాయతీలు



దామరగిద్ద మండలం దేశాయిపల్లి పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నెల చివరలో ఎన్నికల నిర్వహణకు సిద్ధమౌతున్నట్లు సమాచారం. గతంలో మాదిరిగా మూడు విడతల్లో నిర్వహించాలా? లేదా ఒకే విడతలో అన్ని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనా? అనే అంశాన్ని రాష్ట్ర ఎన్నికల, పంచాయతీరాజ్ శాఖ అధికారులు జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మార్చిలో పదో తరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఏక కాలంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యపడదనే విషయాన్ని జిల్లా అధికారులు రాష్ట్ర ఎన్నికల అధికారులకు, ప్రభుత్వానికి వివరించినట్లు తెలుస్తోంది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే తగినంత సిబ్బంది, పోలీసు బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణ, ఇతర సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నట్లు వారు ప్రభుత్వానికి వివరించారు. రెండు విడతల్లో అయితే కొంచెం కష్టమైనా నిర్వహించొచ్చని సూచించినట్లు తెలుస్తోంది.

తగ్గిన జీపీల సంఖ్య

గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు, 3,836 వార్డులు ఉండేవి. ప్రభుత్వం ఇటీవల దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీని మునిసిపాటీగా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బల్సుపల్లి, పెద్దగోప్లాపూర్, మీనిగోనిపల్లి మునిసిపాలిటీలో విలీనం అయ్యాయి. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చడంతో మహబూబ్‌నగర్ మండలంలోని జైనల్లీపూర్, దివిటిపల్లి గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం అయ్యాయి. వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చౌడూరు మండలంలో నవాబ్‌పేట మండలంలోని 12 గ్రామ పంచాయతీలను కలిపారు. దాంతో 441 జీపీలకు గాను 422కు తగ్గనుంది. గత గణంకాల ఆధారంగా 441 జీపీలలో 5,27,302 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 2,62,558 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,64,736 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,178 అధికంగా ఉన్నారు. జీపీల సంఖ్య తగ్గడంతో పోలింగ్ కేంద్రాలతో పాటు ఓటర్ల సంఖ్య కూడా తగ్గనుంది.

ముమ్మరంగా ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఆ మేరకు అన్ని మండలాల అధికారులను ఎన్నికల ప్రక్రియపై అప్రమత్తం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. ఎన్ని విడతల్లో నిర్వహించాల్సి వచ్చినా.. క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశిస్తున్నారు. దాంతో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ చివరి దశలో ఉంది. ఎన్నికల సామాగ్రికి టెండర్లు పిలిచారు. వారు సరఫరాకు సిద్ధంగా ఉన్నారు. జిల్లాకు 12 మంది ప్రత్యేక అధికారులను కలెక్టర్ నియమించారు. ఇతర సిబ్బందిని కూడా నియమించి, ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్ ముద్రణ, ఎన్నికల అధికారుల నియామకం తదితర అంశాలపై నిత్యం వీడియో, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఇటీవల నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని చెప్పొచ్చు.

పేట జిల్లాలో 280 పంచాయతీలు

నారాయణపేట(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పల్లె పోరుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. జిల్లాలో 12 మంది నోడల్ అధికారులను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4,09,090 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2,00,574 మంది, మహిళలు 2,08,513 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 7,939 మంది అధికంగా ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

నేటి నుంచి ఇంటర్

ప్రయోగ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో జనరల్‌కు 36, ఒకేషనల్‌కు 12 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 12,109 మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ఒకేషనల్ మొదటి, ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నామని డీఐఈవో కౌసర్ జహాన్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. మొదటి విడత పరీక్షలకు జిల్లాలో 22 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 18 జనరల్ విద్యార్థులకు, నాలుగు ఒకేషనల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు ఉంటాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్‌సూపరిడేంట్‌గా అదే కళాశాల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పజెప్పారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లాలో ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రతీ కేంద్రానికి ఒకరు చొప్పున చీఫ్‌సూపరిడెంట్స్‌ను నియమించాం. ప్రత్యేక స్క్వాడ్ బృందాలు కూడా తనిఖీ చేస్తాయి.
- కౌసర్ జహాన్, డీఐఈవో, మహబూబ్‌నగర్ జిల్లా

నాలుగు విడతల్లో పరీక్షలు

ఇంటర్ ప్రయోగ పరీక్షలు నాలుగు విడతల్లో జరుగనున్నాయి. మొదటి విడత మూడో తేదీ నుంచి ఏడు వరకు, రెండో విడత ఎనిమిదో తేదీ నుంచి 12 వరకు, మూడో విడత 13వ తేదీ నుంచి నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. చివరి విడత షెడ్యూల్ వివరాలు ఇంకా ప్రకటించలేదు. అందుకు జనరల్ కోసం 36, ఒకేషనల్ కోసం 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 8,392 మంది విద్యార్థులు హాజరుకానున్నరు. ఒకేషనల్‌కు సంబంధించి మొదటి ఏడాది విద్యార్థులు 1,996 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1,721 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొత్తం 12,109 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షల్లో పాల్గొననున్నారు.

నిఘా నేత్రాలు లేనట్లే..

ఇంటర్ ప్రయోగ పరీక్షల నేపథ్యంలో అన్ని కేంద్రాలల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు పెట్టాలన్న నిబంధన పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం అసోషియేషన్ నాయకులు సీసీ కెమెరాలు పెట్టడం తమ వల్ల కాదని, కచ్చితంగా ఏర్పాటు చేయాలంటే తమ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఇవ్వబోమని ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. దీంతో సీసీ కెమెరాలు కేవలం ప్రభుత్వ కళాశాలలకే పరిమితం అయ్యాయి. ప్రైవేట్ కళాశాలల్లో గతంలో ఉన్నవాటితో మాత్రమే సరిపెట్టానున్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

- విద్యుత్ తీగలపై పడిన చెప్పులు తీస్తుండగా ప్రమాదం
- హైదరాబాద్‌లోని షామీర్‌పేటలో ఘటన

5

నేటి నుంచి జోగుళాంబ అమ్మవారి వార్షికోత్సవాలు

- వసంత పంచమి సందర్భంగా నిర్వహణ
- స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం

5

ఘనంగా చెన్నకేశవ స్వామి తిరుకల్యాణం

4

మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో

అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనిక్ ప్యాలెస్ హాల్‌లో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. మైనారిటీల అభివృద్ధి కోసం రూ.45 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న బడ్జెట్‌లో మరిన్ని నిధులు తెచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఎంతో మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ప్రజలకు అవసరమైన పనులు చేపడుతామని, ప్రతీ వార్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు. కుల, మతాలకు అతీతంగా అందరం కలిసి మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోయిన్‌అలీ, మక్సూద్, సాదుల్లా, గౌస్, అవాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్, అవేజ్, అజ్మత్‌అలీ, అఫ్రోజ్, జహీర్, తఖీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

పెళ్లి సందడి

- మాఘమాసం రాకతో మోగనున్న పెళ్లి బాజాలు
- శుభ ముహూర్తాలతో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు



నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం రావడంతో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మూడు ముళ్ల, ఏడడుగులతో ఎన్నో జంటలు ఒక్కటి కానున్నాయి. గత జనవరి 31 నుంచి మాఘ మాసం ప్రారంభమైంది. ఫిబ్రవరి నుంచి మార్చి ఆరో తేదీ వరకు 11 శుభముహూర్తాలు ఉన్నాయి. దాంతో నారాయణపేట జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,500 వివాహాలు జరుగొచ్చని అంచనా. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు కూడా జరుగనున్నాయి. వివాహాల కోసం బంగారం, వెండి ఆభరణాలతో పాటు దుస్తులను కొనుగోలు చేస్తుండటంతో నారాయణపేటలోని ఆయా వ్యాపార సముదాయాల వద్ద సందడి నెలకొంది. గత ఏడాది డిసెంబరు 27వ తేది నుంచి మంచి ముహూర్తాలు లేకపోవడంతో వివాహాది శుభకార్యాలకు బ్రేక్ పడింది. 25 రోజుల తర్వాత ఫిబ్రవరిలో ఎనిమిది, మార్చిలో రెండు శుభ ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఉగాది పండుగ తర్వాత ఏప్రిల్ 14 నుంచి శుభకార్యాలు ఉన్నాయి. మాఘ మాసంలో ఏ శుభ కార్యం నిర్వహించినా రాజయోగం ఉంటుందని నమ్మకం. అందుకే ఈ ముహూర్తాల్లో ఫంక్షన్ హాల్స్ ముందుగానే బుక్ చేసుకున్నారు. కొందరికి అవి లభించక ఆలయాలు, ఇళ్ల ముందు, విశాలమైన స్థలాల్లో పెళ్లిళ్లు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. వివాహాలు, ఇతర శుభకార్యాల దృష్ట్యా పురోహితులు, వాయిద్య మేళం, ఫొటో, వీడియో గ్రాఫర్లు, డెకరేషన్ వారికి చేతినిండా పని దొరకనుంది.

మంచి ముహూర్తాలు ఇవే..

- ఫిబ్రవరిలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి.
- మార్చిలో 1, 2, 6, 7, 12 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.
- ఏప్రిల్‌లో.. 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి.

రాయికోడ్‌లో మొసలి కలకలం

నర్వ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ మండలం రాయికోడ్ గ్రామ శివారులో గొల్ల మొగిలప్ప రైతు వరి పొలంలో ఆదివారం భారీ మొసలి కనిపించింది. భయపడిన రైతు వెళ్లి చుట్టుపక్కల రైతులకు తెలిపాడు. అందరూ వచ్చి మొసలిని చూశారు. భూత్పూర్ సాగునీటి కాల్వ వెంట పొలాల్లోకి వచ్చిందని రైతులు చెప్పారు. విషయాన్ని అటవీ అధికారులకు తెలిపారు. వారు సాయంత్రం వచ్చి వల వేసి, పట్టుకుపోయారు. దాంతో గ్రామ రైతులు ఊపిరి పీల్చుకున్నారు.





రైతు పొలంలో కనిపించిన భారీ మొసలి

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

- ప్రేమ విఫలమై ఒకరు.. మానసిక స్థితి బాగోలేక మరొకరు

మద్దూర్/ కొత్తపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఒకరు, మతిస్థిమితంలేక మరోకరు అదృశ్యమైన ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్, కొత్తపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకోంది. మద్దూర్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకా రం.. కొత్తపల్లి మండలం అల్లీపూర్ చెందిన భాస్కర్ తాను ప్రేమించిన యువతికి మరోకరితో వివాహం నిశ్చయమైందని మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో అతని అన్న కేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మద్దూర్ మండలంలోని నందిపాడ్ చెందిన నర్సింహులు మానసిక స్థితి బాగోలేని కారణంగా భార్య మూడేళ్ల క్రితం వదిలి పెట్టి పుట్టింటికి వెళ్లింది. అయితే గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కొడుకు అదృశ్యంపై తండ్రి కాశన్న ఆదివారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మహేష్ మృతదేహాన్ని తీసుకొస్తున్న కానిస్టేబుల్

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని రాస్తారోకో

5

దివిటిపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్

- ధ్రువీకరణ పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు, 9 ఆటోలు, 2 కార్లు స్వాధీనం
- డీఎస్పీ వెంకటేశ్వర్లు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మండలం దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ఆదివారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. అన్ని ఇళ్లను ఏకకాలంలో తనిఖీలు చేశారు. కిరాణ దుకాణాల్లో విక్రయిస్తున్న వస్తువులను పరిశీలించారు. ఇళ్ళల్లో నివాసం ఉంటున్న, అద్దెకుంటున్న వారి వివరాలు, ఆధార్ కార్డులు, వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలు, తొమ్మిది ఆటోలు, రెండు కార్లను నిలిపేశారు. వాటికి సంబంధించిన పత్రాలు తేవాలని, అప్పుడే ఇస్తామని అన్నారు. కాలనీలో ఉంటున్న అస్పష్టమైన వివరాలతో ఉన్న వ్యక్తులపై విచారణ చేపట్టారు. కొన్ని ఇళ్ళల్లో అసాధారణ కదలికలు గమనించి, మౌలిక సమాచారం సేకరించారు. అదనపు ఎస్పీ ఏ.రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు స్థానికులతో మాట్లాడారు. కమ్యూనిటీ కాంటాక్ట్ అనేది ప్రజలకు రక్షణ కల్పించడం కోసమేనన్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల క్రాస్‌రోడ్డులో హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో లారీ ఢీ కొన్ని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన శ్రీను దంపతులు జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో బస్సులు నిలిపే ప్రాంగణంలో నిలబడ్డారు. నిలబడిన శ్రీనును అదే దారిలో వచ్చిన లారీ ఢీ కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జడ్చర్ల జనరల్ ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా మరొకరు

మూసాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందిన మండలంలోని జానంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం. జానంపేట గ్రామానికి చెందిన హనీఫ్ (52) జీవనోపాధి కోసం కొనేళ్ల క్రితం జడ్చర్లకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. సొంత గ్రామమైన జానంపేట పెట్రోల్ బంకు సమీపంలోని నేరేడు చెరువు అలుగు కాల్వలో చేపల వేట కోసం వచ్చి కొంతమేరకు చేపలు పట్టుకుని అక్కడే వ్యవసాయ పొలంలో తలకింద వాటర్ బాటిల్ పెట్టుకుని నిద్రపోయి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఆటుగా గొర్రెల మేపుకు వెళ్లిన కాపరి పొలంలో మృతి చెందడాన్ని గమనించి పొలం యాజమాని బొక్క రాములుకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చెందిన హనీఫ్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని జడ్చర్లకు తీసుకెళ్లారు. మృతుడి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

రెండు బైకులు ఢీకొని ఇంకొకరు

భూత్పూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన శివరాజు గ్రామం నుంచి మహబూబ్‌నగర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. అదే దారిలో ఎదురుగా తాటికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్‌కు చెందిన యాదగిరి బైక్‌పై గాజులపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో తాటికొండ గ్రామానికి వెళ్లే టీ జంక్షన్ వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇప్పలపల్లికి చెందిన శివరాజు (40) అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంజులతో పాటు ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. యాదగిరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.



సాయిమందిరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లితండ్రులు

చిన్నారులకు అక్షరాభ్యాసం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని సాయి మందిరంలో ఆదివారం సరస్వతీ అమ్మవారికి విశేష పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

ఘనంగా చెన్నకేశవస్వామి తిరుకల్యాణం

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి తిరుకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించారు. తిరుకల్యాణంలో జడ్చర్లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

వీఐపీ కాటేజీలను ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ

దేవాలయ ప్రాంగణంలో దాతలు అయ్యగారి యశోదమ్మ, రంగారెడ్డిల జ్ఞాపకార్థం వారి కుమారుడు అయ్యగారి విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీ రూ.25 లక్షలతో నిర్మించిన వీఐపీ కాటేజీలను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గోకుల్, ఆలయ ఈవో దీప్తిరెడ్డి, ట్రస్టీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాహిత్య సంస్థ సేవలు అభినందనీయం



వాణీ శతకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ సేవలు అభినందనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంటరెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఐదో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ రచించిన వాణీ శతకం ఆవిష్కరణ వైభవంగా జరిగింది. ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల చేత రామాయణ, భారత భాగవతాలు చదివించాలన్నారు. నైతిక, మానవతా విలువలకు శతక ప్రక్రియ దోహద పడుతుందన్నారు. చక్కటి జ్ఞానాన్ని ప్రసాదించే సరస్వతి పుట్టిన రోజు వాణీ శతకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ చేస్తున్న సాహిత్య కృషిని కొనియాడారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆచార్య మనసన చెన్నప్ప మాట్లాడుతూ వేదాలు, శాస్త్రాలు, కావ్యాలు, వాణి కరుణ వల్లనే ఆవిర్భావిస్తాయన్నారు. వాణీ శతకము భక్తి ప్రవత్తులతో కూడుకొని ఉందన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఐదు సంవత్సరాల నుంచి చేస్తున్న సాహితీ సేవలను కొనియాడారు. చుక్కాయపల్లి శ్రీదేవి పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్యాభిలాషను రేకెత్తించేలా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమాంలో గంటా మనోహర్‌రెడ్డి, డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి జి.శాంతారెడ్డి, టి.శ్రీలక్ష్మీ, పురుషోత్తంరెడ్డి, శివార్చక విజయకుమార్, రావూరి సూర్యనారాయణ, రావూరి కృష్ణకుమార్, మేకల అనురాధ, సావిత్రి, ఖాజామైనోద్దిన్, గుముడాల చక్రవర్తిగౌడ్, బోల యాదయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కోళ్ల తరలించే వాహనం, బైకు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జడ్చర్ల క్రాస్‌రోడ్డు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే సబ్‌రోడ్డులో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి జడ్చర్లకు కోళ్లను తరలించే వాహనం వస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన బైకు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బైకుపై ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన రాములు (45) తీవ్రగాయాలయ్యాయి. రాములును చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి, అనంతరం జిల్లా జనరల్ ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పది విద్యార్థులకు అల్పాహారం

నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరవు తున్న విద్యార్థులకు ప్రభుత్వం ఆరు రకాల అ ల్పాహారం అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఈ నెల ఒకటవ తేదీ నుంచి మా ర్చి 20వ తేదీ వరకు అందించేందుకు ఒక్కో వి ద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా పల్లి, బెల్లం చెక్కి, బిస్కెట్స్, బొబ్బర్లు, పకోడ, శనిగలు అందించేలా చర్యలు తీసుకుం టున్నారు. జిల్లా వ్యాప్తంగా 95 ఉన్నత పాఠ శాలలు, 11 కస్తూర్బాలు, రెండు మాడల్ స్కూ ల్స్, పది గురుకులాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తం గా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 6,164 మంది విద్యార్థులు చదువుతున్నారు.



ముడుమాల్ జడ్పీహెచ్‌ఎస్‌లో అల్పాహారంతో విద్యార్థినులు

కోరిన కోర్కేలు తీర్చే జములమ్మ తల్లి



జమ్ములమ్మ అమ్మవారు

గద్వాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పిలువబడి.. మూడు రాష్ట్రాల భక్తుల పూజలందుకుంటూ కోరిన కోరికలను తీర్చుతున్న జమ్ములమ్మ దేవత బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. పుట్టినిల్లు అయిన దీవి గ్రామం గుర్రం గడ్డ నుంచి అమ్మవారిని తీసుకురావడానికి మంగళవారం ఎద్దుల బండి పోతుంది. అక్కడ ఆ రాత్రి పూజల అనంతరం తెల్లవారు జామున ఎద్దుల బండిపై అమ్మవారిని మెట్టినిల్లు అయిన జమ్ములమ్మ దేవస్థానానికి తీసుకువస్తారు. మాఘ శుద్ధపౌర్ణమి రోజు అనగా 12వ తేదీ ఆదివారం పౌర్ణమిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతీ మంగళ, శుక్రవారాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మాఘ శుద్ధ పౌర్ణమికి..

ప్రతీ ఏడాది మాఘశుద్ధ పౌర్ణమి ముందు మంగళవారం రోజున అమ్మవారిని సాంప్రదాయ పద్దతిలో పెట్టినిల్లు అయిన గుర్రంగడ్డ గ్రామం నుంచి తీసుకువస్తారు. ఇందుకోసం ఎద్దుల బండిని సిద్ధం చేశారు. మరుసటి రోజు మెట్టినింటికి తీసుకవచ్చి పూజలు నిర్వహిస్తారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజు అనగా బుధవారం నుంచి ప్రతీ మంగళ, శుక్రవారాలలో ఆరునెలల పాటు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటారు. అదే పౌర్ణమిరోజు గద్వాలలో స్వయంభూ లక్ష్మీచెన్న కేశవస్వామి రథోత్సవం కూడా నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు పూర్తైన ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలలో అమ్మవారిని దర్శించుకోవడానికి దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం వెలిగిపోతుంది. భక్తుల కోసం 30 గదులను అందుబాటులో ఉంచారు. షామియాన వేసుకునే వారికి పరిసరప్రాంతాలతో ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల స్థలాన్ని చదును చేసి ఉంచినట్లు ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్ కుమార్‌లు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించేందుకు 35సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ టంగుటూరు శ్రీను తెలిపారు. భక్తుల ప్రయాణ సౌకర్యం కోసం ఆర్టీసీ వారు జమ్ములమ్మ స్టేజి వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు.

అంగరంగవైభవంగా నిర్వహిస్తాం



అమ్మవారి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తాం. అమ్మవారికి స్వాగతం పలికేందుకు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి కళాకారులు, పుట్టబొమ్మలు, పోతురాజులు, శివసత్తులు, డప్పువాయిద్య కళాకారులను పిలిపించాం. వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

\- వెంకట్రాములు, ఆలయ చైర్మన్, జములమ్మ ఆలయం

వివాదాస్పదంగా మారిన బైపాస్

- కల్వకుర్తి, నంద్యాల జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వబోమని రైతుల ఆందోళన



శనివారం బైపాస్ రోడ్డు కోసం సర్వే చేస్తున్న అధికారులు

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కల్వకుర్తి నంద్యాల 167కే జాతీయ రహదారికి సంబంధించి కొంతకాలంగా భూనిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ప్రధానంగా బైపాస్ రోడ్డుకు సంబంధించి గతంలో మూడు అలైన్‌మెంట్లకు ప్రభుత్వం సర్వే చేసింది. మూడు సర్వేలకు సంబంధించి వెంకటాపూర్ గేటు నుంచి వెళ్లే రహదారికి సంబంధించి రెండు కిలో మీటర్లన్నర రోడ్డు అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేశారు.

అలైన్‌మెంట్ ఫైనల్ చేసినప్పటి నుంచి ఉన్న కొద్ది భూమిని కోల్పోతున్న రైతులు కొంతమంది ఆందోళనలు చేస్తూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయినప్పటికీ సర్వే పనులు ఎక్కడ ఆగలేదు. ఈ తరుణంలో రెండున్నర కిలోమీటర్ల పరిధిలో సుమారు 60 ఎకరాల భూములు పోతుండగా వీటిలో 800 మీటర్లకు సంబంధించి నిరుపేదలైన 25మంది రైతులు ఆందోళన చేస్తున్నారు. ప్రధానంగా ఇందులో పదెకరాలకు సంబంధించి సర్వే నెంబరు 68లో ఒక రైతు, 72లో 10మంది, 120లో ముగ్గురు, 126 సర్వే నెంబరులో ఎనిమిది మంది, 134 సర్వే నెంబరులో ఇద్దరు రైతులు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఎంత ఇస్తామనే విషయాన్ని చెప్పకుండా సర్వే చేస్తూ జాతీయ రహదారి అంటూ హద్దులు ఏర్పాటు చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే గత కొన్ని రోజులుగా రహదారి, రెవెన్యూ, పోలీస్ అధికారుల మధ్య రైతులతో నిత్యం వివాదాలు జరుగుతున్నాయి. శనివారం పోలీసుల బందోబస్తు మధ్య భూములు సర్వే చేస్తుండడంతో ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి పోలీసులు, రెవెన్యూ అధికారులు సర్వే పనులను పూర్తి చేసి జాతీయ రహదారికి సంబంధించి హద్దులను ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న వారికి భారీగా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పరిహారం ఇవ్వకుండా భూమి లాక్కోవడం సరికాదు



జాతీయ రహదారికి సంబంధించి భూ ములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహా రం అందించకుండా హద్దులు ఏర్పాటు చే యడం ఎంత వరకు సమంజసం. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్లను మార్చాల్సిందే. ప్రభుత్వ కార్యకలాపాలకు జాతీయ రహదారులకు పేద, దళితుల భూములే తీసుకోవడం సరికాదు. అధికారులు స్పందించి నిర్వాసిత రైతులకు నష్ట పరిహారం పెద్ద ఎత్తున వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

\- చింత సత్తి, తాడూరు బైపాస్ రోడ్డు భూనిర్వాసితుడు



ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుపుతున్న అర్చకులు

భక్తి శ్రద్ధలతో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి కల్యాణం

అయిజ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వస్వామి కల్యాణం ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఈ నెల 1వ తేదీ నుంచి ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 12-15 నిమిషాల ప్రాంతంలో కల్యాణం జరిపించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణానికి హాజరయ్యారు. చిన్నారుల కూచిపూడి నృత్యం అందరిని అలరించింది. కుమారి దివ్య బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు కోలాటాలు ఆడుతూ చేసిన నృత్యాలు సైతం అలరించారు.



ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రాజోలి, ఫ్రిబవరి 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడులో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద చిన్నారుల కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించిన దృశ్యం

సినిమాకు డబ్బులు ఇవ్వలేదని బాలుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సినిమాకు డబ్బులు ఇవ్వలేదని ఓ బాలుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సంతబజార్‌లో నివాసముంటున్న జలగరి గణేశ్, భారతి దంపతులకు కుమార్తె సంధ్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం సినిమాకు వెళ్తానంటూ కార్తీక్ (13) తండ్రిని డబ్బు అడిగాడు. తాము గుడికి వెళ్తున్నామని, ఇంట్లో ఉండాలని, వచ్చాక డబ్బులు ఇస్తామని చెప్పి, కుమార్తె సంధ్యను తీసుకొని వెళ్లారు. తిరిగి వచ్చే సరికి గది తలుపు దగ్గర వేసి ఉంది. లోనికి వెళ్లి చూడగా, అప్పటికే కార్తీక్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. సంఘటనపై తండ్రి జలగరి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



వనపర్తిలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో కోత విధించడం గిరిజనులను మోసం చేయడమే అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్ట ఆంజనేయులు అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్‌కు నిరసనగా నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీ, రాజు, ఉమాదేవి, సీపీఎం వనపర్తి పట్టణ నాయకులు కురుమయ్య, గంధం మదన్, గట్టయ్య, బాలస్వామి, రాబర్ట్, మన్యం, త్యాగయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని విమర్శించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు మిగతా బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి బడ్జెట్‌లో పూర్తి స్థాయిగా అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కా ర్యదర్శి జీఎస్ గోపి, ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, రవి, రాఘవేంద్ర, తిరుపతి, షేక్‌పాషా, వెంకటేష్, మల్లేష్, రవి, ప్రకాష్, వినోద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంజన్న బ్రహ్మోత్సవాలు

● కనుల పండువగా పల్లకీసేవ, తెప్పోత్సవం

ధరూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ధరూరు మండలపరిధిలోని పెద్దచింతరేవుల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి బ్రహోత్సవాలు రెండో రోజు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు స్వామివారికి పల్లకీసేవ, ప్రభోత్సవంతో పాటు తెప్పోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రీలు, మేళతాళాలు, స్వామివారి నామాల నుస్మరిస్తూ స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామివారి పల్లకీసేవా కార్యక్రమంలో వ్యవస్థాపక వంశీయులు గిరిరావు, కార్యనిర్వాహణాధికారి కవిత, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మాఘ శుద్ధ వసంత పంచమి సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు రాత్రి 10 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుకుండా బందోబస్తుతో ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల్లో నైరాశ్యం

» మంజూరు పత్రాలు వెనక్కి తీసుకున్న అధికారులు

వెల్దండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పథకం అబాసుపాలవుతున్నది. ఇళ్ల నిర్మాణాలతో ఇక తమ సమస్యలు తీరుతాయని భావించిన నిరుపేదలకు మంజూరైన పత్రాలు ఇచ్చినట్టే ఇచ్చి అధికారులు వాపసు తీసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఇచ్చిన పత్రాలపై కలెక్టర్ సంతకం లేదని, సంతకాలు అయిన తర్వాత మళ్లీ ఇస్తామని లబ్ధిదారులకు చెప్పినా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. ప్రజాపాలనలో భాగంగా పథకాల అమలుకు మండలంలోని చెర్కూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున మండల అధికారులు గ్రామానికి చెందిన 98 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇక తమ సమస్యలు తీరుతాయని, తమ ఇంటి కల నెరవేరనుందని ఆనందపడ్డారు. ఈ మేరకు గత నాలుగు రోజుల క్రితం గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి సైతం గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించారు. కానీ మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారుల ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఇచ్చిన మంజూరు పత్రాలపై కలెక్టర్ సంతకం లేదని, తిరిగి సంతకాలు చేయించి పత్రాలు అందిస్తామని అధికారులు పత్రాలను వాపసు తీసుకున్నారు. ఇచ్చిన పత్రాలు తిరిగి ఇస్తారోలేదోనన్న ఆందోళన లబ్ధిదారుల్లో చోటుచేసుకుంది. ఈ విషయంపై ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డిని వివరణ కోరగా సంతకాలు లేకుండా పత్రాలు ఇచ్చామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పత్రాలు వాపసు తీసుకున్నామని తెలిపారు. పత్రాలపై సంతకాలు చేయించిన అనంతరం తిరిగి ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారిని గుర్తించి మంజూరు పత్రాలు అందజేస్తామని అన్నారు. కాగా తమకు వస్తాయోరావోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. సంతకాలు లేకుండా మంజూరు పత్రాలు ఇవ్వడమేమిటని లబ్దిదారులు ప్రశ్నిస్తున్నారు. కాగా చెర్కూర్‌లో అందజేసిన పత్రాల మాదిరిగానే జిల్లాలో వివిధ గ్రామాల్లో పత్రాలు పోలి ఉండటం, అక్కడ వాపసు తీసుకోకుండా ఇక్కడ తీసుకోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలు పారదర్శకంగా అందించాల్సి ఉంది.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి



చిట్టి(ఫైల్)

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన చిట్టి(40) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వివరాల ప్రకారం.. పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన అంజి, చిట్టెమ్మ దంపతుల మధ్య కొంత కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 28వ తేదీన పురుగుల మందు తాగింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గత ఐదారు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో మృతురాలి భర్త అంజి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి..

మక్తల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మురుగుకాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని కేశవనగర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బండారి వెంకటేష్(46) పురపాలిక కార్మికుడిగా పనిచేసేవాడు. ఆరోగ్య సమస్యలతో విధుల్లోకి వెళ్లకపోవడంతో గత కొంత కాలంగా భార్య సుజాత పురపాలిక కార్మికురాలిగా పని చేస్తుంది. ఈ క్రమంలో వెంకటేష్ తాగుడుకు బానిసయ్యాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున బటయకు వచ్చి రోడ్డుపై వెళుతుండగా ప్రమాదశవాత్తు కాలుజారి డ్రైనేజీలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు..

కోస్గి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కమలుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన శివ తన స్నేహితుడు హన్వాడ మండలంలోని మునిమోక్షం గ్రామానికి చెందిన కేశవులు ఇద్దరు కలిసి బైక్‌పై సంపల్లి నుంచి నాచారం గ్రామానికి సొంత పనుల నిమిత్తం వెళుతున్న క్రమంలో కోస్గి శివారులో గల నాగసాన్పల్లి చౌరస్తా, ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని ఆటో వెనుకాల నుంచి ఓవర్ టేక్ చేస్తుండగా బైక్ అతివేగంగా ఉండటంతో అజాగ్రత్తగా సడన్ బ్రేక్ వేయడంతో బైక్ వెనకాల ఉన్న శివ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు.

దీంతో శివ తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కోస్గి ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన రక్త గాయాలు కావడంతో శివ మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి కుర్వ బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వివాహిత..

మూసాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కాటవరం గ్రామానికి చెందిన ఓ వివాహిత విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కాటవరం గ్రామానికి చెందిన గొల్ల శిరీష(35) తన భర్త రాజు కుటుంబ సభ్యులతో కలిసి గత కొంత కాలం నుంచి జీవనోపాధి కోసం హైదరాబాద్‌లోని షామీర్‌పేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. అద్దె ఇంట్లోని మూడో అంతస్థులో నివాసం ఉండే వీరి పిల్లలు శనివారం సాయంత్రం ఆటలు ఆడుతుండగా చెప్పులు విద్యుత్తు తీగలపై పడటంతో గొల్ల శిరీష వాటిని తీసే క్రమంలో ప్రమాదానికి గురై అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందింది. దీంతో ఆదివారం మృతదేహాన్ని కాటవరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఓ తండాకు చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడని యువకునిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బాలిక తన వరుసకు బాబాయ్ అయిన యువకుడు ఇటీవల అసభ్యంగా ప్రవర్తించాడని అట్టి విషయాన్ని తల్లిదండ్రులకు ఆమె వివరించింది. ఆదివారం తల్లిదండ్రులు అచ్చంపేట పోలీసుస్టేషన్‌లో సదురు వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి జోగుళాంబ అమ్మవారి వార్షికోత్సవాలు

అలంపూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు సంవత్సరానికి ఒకసారి జరుగుతాయి. అందులో భాగంగానే సోమవారం వసంత పంచమిని పురస్కరించుకొని అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి ఆలయ యాగశాలనందు నిత్య హోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘట్టములకు ఆవాహన అర్చన అనంతరం జోగుళాంబ అమ్మ వారికి (మూలమూర్తికి) అవబృత స్నపనం, పంచామృతాభిషేకం నిర్వహించి అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణోత్సవం, 6 గంటలకు ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తం అవుతాయి. వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు వహించాలని ఆలయ సిబ్బందిని ఈవో పురేందర్ కుమార్ సూచించారు.

భలాన్‌పల్లిలో సూర్యకాంతులు

● నేటి నుంచి సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

» రాష్ట్రంలోనే భలాన్‌పల్లిలో ఉన్న ఏకైక సూర్యనారాయణస్వామి దేవాలయం

» ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

తాడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక సూర్యనారాయణస్వామి దేవాలయం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్ పల్లి గ్రామంలో ఉంది. ఈ ఆలయాన్ని 400 సంవత్సరాల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించారు. కాలక్రమేణా తదనంతరం ముస్లిం రాజుల పరిపాలనలో ఆలయం ధ్వంసమైనట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. అయితే అతి పురాతన ఆలయం కావడం మూలంగా 2020లో గ్రామస్థులందరూ కలిసి ఆలయాన్ని పునర్ని ర్మించాలని నిర్ణయించారు. ప్రతీ రథసప్తమిని పురస్క రించుకుని సూర్యభగవా నుడికి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు.

అయితే, ఈనెల 4వ తేదీన రథసప్తమి నాడు సూర్యాస్తమయం సందర్భంగా సూర్యభగవానుడి విగ్రహంపై కిరణాలు పడటం ప్రత్యేకం.

● బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

సూర్యభగవానుడి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయం నందు గ్రామస్థుల అందరి సహాయ సహకారాలతో నూతన ఆలయ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు కాగా బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన అన్ని పనులకు సంబంధించి కూలంకషంగా చర్చించుకున్నారు. సూర్యభగవానుడి ఆలయం దర్శనానికి సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి 25కిలో మీటర్లు కాగా జడ్చర్ల నుంచి 30కిలో మీటర్లు, కల్వకుర్తి నుంచి 30కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉన్నది. సూర్యభగవానుడి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా అరసవెల్లిలో ఉండగా ప్రస్తుతం తెలంగాణలోని భలాన్‌పల్లి గ్రామంలో ఉంది.

● బ్రహ్మోత్సవాల వివరాలు

సూర్యభగవానుడి రథసప్తమి పర్వదినాన్ని పురస్క రించుకుని జరిగే బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా.. 3వ తేదీ సోమవారం ఉదయం 6గంటలకు సూర్యనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేసి స్వామి వారికి అభి షేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులచే సూర్యఆదిత్య పారాయణం, భగవద్గీత, ప్రథమ శతకం పారాయణం, మలయాళ స్వామి చేతుల మీదుగా విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహించగా 4వ తేదీ మంగళవారం సూర్య నారాయణస్వామి ఆదిత్య హృదయా పారాయణం, ఛాయాదేవి, ఉషాదేవి సమేత సూర్యభగవా నుడి కల్యాణోత్సవం మధ్యాహ్నం 11గంటలకు నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటలకు ఆలయ ప్రాంగణం చుట్టూ బండ్ల ఊరేగింపు చేయనున్నారు. 5వతేదీ బుధవారం ఉదయం 8గంటలకు స్వామి వారికి అభిషేకం, పూజలు పూర్తైన అనంతరం సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలను నిర్వహించడం జరుగుతుంది.

ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా స్థానిక శాసనస భ్యులు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలు హాజరవనున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజు మధ్యాహ్నం దాతల సహకారంచే అన్నప్రసాదాలను అందజేయడంతో పా టు సూర్యనారాయణస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భజన పోటీలను సైతం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 20వేలు, రెండవ బహుమతి 15వేలు, మూడవ బహుమతి 10 వేలు, నాల్గవ బహుమతి 6వేలు, 5వ బహుమతి 4వేలు, 6వ బహుమతి 2వేలు ఇవ్వనున్నట్లు మరో ఐదు భజనమండలిలకు ప్రోత్సాహక బహుమతిగా 516రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో జరిగే అన్ని కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



తాడూరు మండలంలోని భలాన్‌పల్లి గ్రామంలో ఉన్న సూర్యనారాయణస్వామి పురాతన దేవాలయం



సూర్యభగవానుడి మూల విరాట్

భక్తుల ఇలవేల్పు

● స్వయంభూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» నేడు కల్యాణోత్సవం .. రేపు రథోత్సవం

» ఏడు నుంచి 16వ తేదీ వరకు జాతర

కొత్తకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామంలోని స్వయం భూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేత్ర పర్వంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంత భక్తుల ఇలవేల్పుగా ఖ్యాతి పొందిన స్వయంభూ వేంకటేశ్వరస్వామి రాజుల కాలంలో నిర్మించబడిన దేవాలయం. ఇప్పటికీ ఈ దేవాలయం గ్రూప్ ఆఫ్ టెంపుల్ (వనపర్తి రాజవంశస్థులు) ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ప్రతీ ఏడాది మాఘమాసం తదియ సందర్భంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయి నవమితో ముగిస్తాయి. ఆ మరుసాటి రోజు నుంచి పదిహేను రోజుల పాటు జాతర జరుగును.

ఇక్కడి జాతర మాత్రం ప్రజలతో పక్షం రోజులు కళకళలాడుతుంది.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ..

స్వయంభూ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మాఘమాసం తదియను పురస్కరించుకొని శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. చవితి రోజు ధ్వజారోహణ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి భేరి పూజలు, దేవతాహ్వాన కార్యక్రమం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దివ్య జ్యోతిగా వెలుగుతోన్న ఆఖండజ్యోతి

స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అఖండ జ్యోతి దివ్యజ్యోతిగా వెలుగుతోంది. ఆలయ పునర్ధుదరణ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలు చేపట్టారు ఆ సమయంలో గాలి వానలతో ఈ ప్రాంతం బీభత్సవానికి గురైంది. భక్తులు, వేదపండితులు బతుకు జీవుడా అంటూ తలోదిక్కు వెళ్లారు. కానీ పూజల కోసం ఏర్పాటు చేసిన కుటీరం కూలిపోయినా అందులో ఓ మూలన ఉన్న దీపం మాత్రం వెలుగుతూ ఉండింది.

అదే ఆ గ్రామ ప్రజలకు విశ్వాసం పెంచింది. అప్పటి నుంచి పెద్దలు ఆలయ చరిత్ర చెపుతున్నట్లుగా తిరుపతి వేంకటేశ్వరస్వామి ఇక్కడ దర్శనం ఇస్తున్నారని భక్తుల నమ్మకం.



అమడబాకుల గ్రామంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయం



వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

కనుల పండువగా కల్యాణోత్సవం

మాఘమాసం పంచమి పురస్కరించుకొని స్వయంభూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమడబాకుల గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాలైన సత్యహళ్లి, బూత్కూర్, ముమ్మళపల్లి, రాయనిపేట, సంకిరెడ్డిపల్లి, కొత్తకోట గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణోత్సవం తిలకించడానికి హాజరవుతారు. కల్యాణోత్సవానికి ముందు హోమం, బలిహరణ అనంతరం ప్రభోత్సవం, డోలోత్సవ కార్యక్రమంలో నిర్వహిస్తారు. సప్తమి రోజున పూలతో అలంకరించిన రథోత్సవం (తేరు) ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ రథో త్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేంకటేశ్వరస్వామి నామసర్మణ చేస్తూ తేరు లాడగం జరుగుతుంది. నవమితో నాగవెళ్లి పూజలతో బ్రహ్మోత్సవాలు ముగించడబుతాయి.

కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం..

ఏడాదికి ఒక్కసారి స్వయంభూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించడానికి ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేపట్టింది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తుల కోసం షామియానాలు, కుర్చీలు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం అన్నదానం కొనసాగుతుంది.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

జడ్చర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఉదండాపూర్ ప్రాజెక్టులోని నీళ్ల నిలిచిన గుంతలో పడి గల్లంతయిన బాలుడి మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఉదండాపూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల మల్లయ్య, పార్వతమ్మల కుమార్తె భాగ్యలక్ష్మి(6), కుమారుడు మహేష్(4)లు శనివారం ప్రమాదవశాత్తు నీళ్ల నిలిచిన గుంతలో పడ్డారు. ఈ సంఘటనలో భాగ్యలక్ష్మి మృతదేహం లభించగా, మహేష్ గల్లంతయ్యాడు. మహేష్ మృతదేహం ఆదివారం ఉదయం నీటి గుంతలో లభ్యమయ్యింది.

ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు ఇద్దరు నీళ్ల నిలిచిన గుంతలో పడి మృతి చెందడంతో ఉదండాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. నీళ్ల గుంతలో పడిన భాగ్యలక్ష్మి, మహేష్‌లను వెదికేందుకు సంఘటన స్థలంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు చంద్రమోహన్, శివానందం, జడ్చర్ల ఫైర్‌మెన్ లక్ష్మీకాంత్‌రెడ్డిల బృందం గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన భాగ్యలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉదయం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాలింపు చర్యలు చేపట్టిన అనంతరం లభ్యమయిన బాలుడు మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ధర్నా చేపట్టారు.



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ రాస్తారోకో

ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్మాణంలోని నీళ్ల నిలిచిన గుంతలో పడి ఒకే కుటుంబంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు దాదాపు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఆందోళన నిర్వహించిన వారి వద్దకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు చేరుకుని బాధిత కుటుంబానికి పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించి, సంఘటన స్థలంలో రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

దీంతో బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ధర్నా విరమించారు. ఇద్దరు చిన్నారులను కోల్పోయిన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామంటూ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి వెల్లడించారు.

కల్యాణం.. కమనీయం

» వైభవంగా పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పాలెం వెంకన్న స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కమనీయంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం స్వామి కల్యాణం వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కల్యాణ మండపానికి తీసుకెళ్లి పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. అమ్మవారికి, స్వామివార్లకు జీలకర్ర బెల్లం పెట్టించిన అనంతరం మాంగల్యధారణ భక్తుల హర్షధ్వనుల మధ్య కనుల పండువగా కల్యాణఘట్టం, తలంబ్రాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ మాజీ చైర్మన్ జున్నా శేఖర్ రెడ్డి అన్నదానం చేపట్టారు. అనంతరం స్వామి కల్యాణోత్సవానికి సహకరించిన దంపతులను ఘనంగా సన్మానించి వేదపండితులు ఆశీర్వదించారు.

కల్యాణోత్సవంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మనుసాని విష్ణుమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సుమలత దంపతులు, మాజీ సర్పంచ్ గోవిందు లావణ్య, నాగరాజు దంపతులు, ఉపసర్పంచ్ చికొండ్ర రాములు, చంద్రకళ దంపతులు, ఈవో చిలుకూరు రంగారావు, శ్రీనివాస్ గుప్తా, అర్చకులు కొరవి రామానుజాచార్యులు, జయంత్, చక్రపాణి, ఆలయ కమిటీ మాజీ సభ్యులు గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు, సొప్పరి బాలస్వామి, వలంటీర్లు కొంకల మధు, శివకుమార్, జగదీష్, వెంకటే ష్, వెంకటరమణ, దయానంద్, గోపాలస్వామి ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఆర్కే స్పోర్ట్స్ కరాటే దూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపీ-2025 కరాటే పోటీలు నిర్వహించారు. పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, కరాటేలో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, పద్మారెడ్డి, సీనియర్ మాస్టర్ రవీందర్, అకాడమీ ఫౌండర్ రవికుమార్, అడ్వైజర్ విజయ్‌కుమార్, మాస్టర్లు రవినాయక్, శంకర్‌నాయక్, సలాం, నాని, పద్మాచారి, రఘువీర్‌ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

జాతీయ స్థాయికి ఎంపికవ్వాలి

» కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యేందుకు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడి యంలో శేరెల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలకు కలెక్టర్ హాజరై బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో ప్రతిరోజు శిక్షణ పొందాలన్నారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు శేరెల్లి ప్రీమియర్ లీగ్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతాయని, ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు శాంతి ప్రతీకలైన పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. తహసీల్దార్ మల్లికార్జున్, డీవైఎస్‌వో జితేందర్, మాజీ కౌన్సిలర్, న్యాయవాది భీమ్‌సేన్‌రావు, శేరెల్లివీధి క్రీడాకారులు ఉన్నారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

న్యూస్ బాక్స్

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు: ఎస్పీ

నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోవద్దని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తారని, అధిక లాభాలకోసం ఆశపడి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టకూడదని సూచించారు. కొత్త వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపిస్తే, దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెబితే నమ్మకండని తెలిపారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930, 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తారని పేర్కొన్నారు.

యాదగిరి ఆశయాలను కొనసాగిద్దాం

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ యాదగిరి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం యాదగిరి సంతాపసభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తన జీవితాన్ని ప్రజల కోసం దారబోసిన గొప్ప వ్యక్తి యాదగిరి అని కొనియాడారు. ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితాన్ని ఎదుర్కొన్నారన్నారు. ఆయన మరణం తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, నారాయణ, నరసింహ, వెంకట్రాములు, భాస్కర్, సాయికుమార్, మంజుల, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐదవ తేదీ నుంచి బొడ్రాయి మహోత్సవాలు

ధన్వాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఈనెల ఐదవ తేదీ నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5న గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ధ్వజారోహనం, అంకురార్పణ, అభిషేకం, మహా మంగళహారతి, విష్ణుసహస్ర పారాయణం, ఆరున ప్రతిష్ఠాపన హోమం, ధాన్యదివాసం, శయ్యదివాసం, ఏడున యంత్రప్రతిష్ఠ, అన్నంతో బలిహరణం, ఇతర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు పశ్చిమాద్రి పీఠాధిపతులు రాక

కృష్ణ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గుడెబల్లూరులో సోమవారం జరిగే జాతర సందర్భంగా ఈశ్వర్ ఆలయానికి నేరడుగం పశ్చిమాద్రి సంస్థాపన పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వాములు, మఠాధిపతులు రానున్నారు. జాతరలో జరిపే సామూహిక వివాహాల గురించి సందేశాన్ని ప్రజలకు తెలియజేస్తారు.

గన్నీ బ్యాగులు లేక రైతుల ఇబ్బందులు

మక్తల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రంలో గన్నీబ్యాగులు లేక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఐదు రోజులు అవుతున్నా రైతులు కల్లాల్లోనే ఆరబెట్టుకున్నారు. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గన్నీబ్యాగులు అందించాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మరికల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని మాదారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మక్తల్ లక్ష్మయ్య కాడెద్దు పొలంలో మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగిలి అక్కడికక్కడే ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని రైతు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక స్థాయిలో జరిగిన అబాకస్ పోటీలలో యూనివర్సల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుకేషనల్ టెక్నాలజీ అబాకస్, వేదిక మ్యాథ్స్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఆస్నియా ఆనాం, మహ్మద్ అనాస్ మూడో ర్యాంక్ సాధించగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

మక్తల్: పట్టణంలోని రేడియంట్ పాఠశాల విద్యార్థి అనిల్ జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జూనియర్ అబాకస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

నేడు కాంగ్రెస్ నిరసన

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై వివక్ష చూపారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సోమవారం ఉదయం పది గంటలకు కుంభం శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నర్సిరెడ్డి చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఒకే భవనంలో మూడు పాఠశాలలు

» ఇబ్బందిగా మారిన తరగతుల నిర్వహణ



మద్దూర్‌లో మూడు పాఠశాలలు కొనసాగుతున్న భవనం ఇదే..

మద్దూర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఒకే భవనంలో మూడు పాఠశాలలు కొనసాగిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. మద్దూర్‌లోని ఉర్దు మీడియం పాఠశాలలో ఉర్దు ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగిస్తున్నారు. మద్దూర్‌లోని బాలుర ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో దీని పునర్నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. వీటి పనులు ప్రారంభించే క్రమంలో పాఠశాలలను రెండేళ్ల క్రితం పట్టణంలోని ఉర్దు మీడియం భవనం తాత్కాలికంగా తరలించారు. నాటి నుంచి పాఠశాలను అక్కడే నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో తరగతుల నిర్వహణ సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. నత్తనడకన సాగిన పాఠశాల నిర్మాణం ఎట్టకేలకు ఇటీవలే పూర్తయ్యింది. వెంటనే పాఠశాల నూతన భవనాన్ని పారంభించి ఉర్దూ మీడియం ఆవరణలో కొనసాగుతున్న తెలుగు మీడియం పాఠశాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలను తరలిస్తాం



కొత్త పాఠశాల నిర్మాణ పనుల దాదాపు పూర్తి అయ్యాయి. అయితే ఏఈ ధ్రువీకరించి ప్రారంభోత్సవం జరిన తర్వాత ఆ భవనంలోకి పాఠశాలను మారుస్తాం.

- బాలకిష్టప్ప, మండల విద్యాధికారి

శక్తిపీఠంలో సామూహిక అక్షరాభ్యాసం


శక్తిపీఠంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంత్‌మఠమూల మహా సంస్థానం శక్తిపీఠం ఆధ్వర్యంలో ఆదివారం వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసం శారదాంబ కల్యాణ మండపంలో నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు గణపతి, సరస్వతీమాతా సంకల్పం చేసుకుని పూజల ధమ్య స్వామి శాంతనంద చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. బాల్యం నుంచి చిన్నారులకు చదువుతోపాటు సంస్కారం అందించాలని అప్పుడే హిందుత్వం నిలబడుతుందని స్వామిజీ వివరించారు.

వైభవంగా వసంత పంచమి యజ్ఞాలు

దామరగిద్ద: కర్ణాటక రాష్ట్రం కాలబురిగి జిల్లా సేడం తాలుక యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో వసంత పంచమిని పురస్కరించుకొని యజ్ఞ కార్యక్రమాలు ఆదివారం నాల్గవ రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. వీరధర్మతజ మాత మాణిక్యగిరి ట్రస్టు కార్యదర్శి శివయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యజ్ఞ కార్యక్రమాల్లో పలు గ్రామాల నుంచి దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాణికేశ్వరి మాత పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన


దామరగిద్దలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొన్న శివమాలధారులు

దామరగిద్ద, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాపన్‌పల్లిలో కొత్తగా నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం వైభవంగా కొనసాగాయి. ఉదయం 11 గంటలకు భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శుభ ముహూర్తాలతో వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య శివలింగం, నంది, భ్రమరాంబిక, గణపతి, జంటనాగులు, నవగ్రహాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన సాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

మక్తల్ రూరల్: మండలంలోని కాట్రేవ్‌పల్లిలో ఆదివారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన చేపట్టారు.

భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

» సీఐ శివశంకర్


పేటలో టాలెంట్ టెస్టును పరిశీలిస్తున్న అధికారులు

నారాయణపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడాలని సీఐ శివశంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పూసల్‌పహాడ్ టెస్ట్ ఆదివారం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించగా ఎంఈవోలు బాలాజీ, బాలకిష్టప్ప, డీఈవో సెక్టోరియల్ అధికారి నాగర్జునరెడ్డి, సీఐ పరిశీలించారు. విద్యార్థులు ఇష్టంతో చదవాలని ఉన్నత లక్ష్యాలను చేరేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి 120 మంది ఉపాధ్యాయుల సహకారంతో విజయవంతంగా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో షేర్ కృష్ణారెడ్డి, పారిజాత, గుంపు బాల్‌రాజ్, దూస సీతారాములు, కనకప్ప, నర్సింహ, కిశోర్, శ్రీనివాస్‌రెడ్డి, తిపుపతయ్య, బసంత్‌రెడ్డి, భగవంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని సత్యసాయి మందిరంలో విద్యార్థులకు ఆదివారం పూసల్‌పహాడ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.ఈ పరీక్షకు 600 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు, రిటైర్డ్ జీహెచ్ఎం భాస్కర్, తపస్ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాకేష్ తెలిపారు. ఉపాధ్యాయులు వెంకట్రాములు, రవీందర్‌రెడ్డి, ప్రవర్ధన్, నరేష్‌కుమార్, అనిల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, దర్శిన్, శివరాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సీసీ రోడ్లు


కొత్తపల్లిల్లోని ఓ వీధిలో సైడ్‌కు మట్టిలేని సీసీ రోడ్డు

మద్దూర్/కొత్తపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి మండలంలోని పలు గ్రామలలో సీసీ రోడ్ల నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో వేసిన సీసీ రోడ్లు కొన్ని చోట్ల ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. గ్రామాలలో వీధుల్లో సీసీ రోడ్లు వేసి పక్కన మట్టి వేయడం మరిచారు. దీంతో రోడ్లపైన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు కిందకు దిగితే కింద పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డు పక్కన మట్టి వేసి వాహనదారులను ప్రమాదాల నుంచి తప్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చిన్నారులను సన్మార్గంలో నడపాలి


మాట్లాడుతున్న భోజనపల్లి నరసింహమూర్తి

నారాయణపేట, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి) : హిందువులంతా ఐక్యంగా ఉండి సత్సంగ్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి చిన్నారులను సన్మార్గంలో నడపాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బజరంగ్‌దళ్ కమిటీని ఎన్నుకున్నారు. సంయోజక్‌గా నీరటి వెంకటేష్, సహ సంయోజక్‌గా ఆకాష్, దుర్గవాహిని సభ్యులుగా లలిత, కార్తీక, జ్యోష్న, వైష్ణవి, మాతృమండలి కార్యకర్తలుగా సురేఖ, రాజేశ్వరి, జ్యోతి, కన్న, చంద్రకళ, వందన, రేఖ, కల్యాణి నందినిలను ఎన్నుకున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


కృష్ణ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడెబల్లూరు చెందిన వాకిటి తాయమ్మ తన మూడో కాన్పు నిమిత్తం పురిటి నొప్పులతో బాధపడుతూ 108 అంబులెన్స్‌కు ఆదివారం సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే స్పందించి ఆ ఆమెను మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో నల్లగట్టు మారెమ్మ వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్‌లోనే ఈఎంటీ రాకేశ్ సహాయంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. సమయ స్ఫూర్తితో అత్యవసర సమయంలో స్పందించిన సిబ్బంది, ఈఎంటీ రాకేష్, పైలెట్ అనిల్, కుటుంబ సభ్యులతోపాటు ఆసుపత్రి వైద్యులు అభినందించారు.

చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

కోస్గి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలల సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హరిత విప్లవ మండలి, యంగ్ ఎర్త్ లీడర్స్ ఆధ్వర్యంలో చిత్తడి నేలల జీవ వైవిధ్యం అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిత్తడి నేలలు భూగర్భ జలాలు పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. గ్రామ శివారులోని బొగ్గుల కుంట ప్రాంతంలోని చిత్తడి నేలలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం గల వివిధ రకాల చిత్తడి నేలల వివరాలను వీడియో ద్వారా తిలకించారు.

సేవాసమితి ఆధ్వర్యంలో శ్రమదానం


కోనేరును శుభ్రపరుస్తున్న యువకులు

నారాయణపేట రూరల్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో రాబోయే తిమ్మప్ప జాతరను పురస్కరించుకుని గ్రామ భారతి వికాస సేవాసమితి, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కోనేరును ఆదివారం శుభ్రపరిచారు. ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు. భక్తులు కోనేటిలో స్నానం చేసేందుకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. సేవాసమితి అధ్యక్షుడు మధుసుదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, పిల్లి వెంకటేష్, హరికృష్ణ, బనదేశ్వర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు.. గట్టు తిమ్మప్ప

» నేటి నుంచి బ్రహ్మోత్సవాలు, 4న రథోత్సవం

» వేలాదిగా తరలిరానున్న భక్తులు


గట్టుతిమ్మప్ప ఆలయ ముఖద్వారం

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోరికలు తీర్చే దైవం వేంకటేశ్వరస్వామి సాక్షాత్తు నడయాడిన స్థలంగా మక్తల్ మండలం మాద్వార్ గ్రామ శివారులో గట్టు తిమ్మప్ప క్షేత్రాన్ని భక్తులు కొనియాడుతారు. ఏటా రథ సప్తమి రోజున వైభవంగా జరిగే రథోత్సవం వీక్షించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా పక్కన రాష్ట్ర నుంచి సైతం తరలి వస్తారు. ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు విద్యుత్ దీపాల అలంకరణ, ఇతర ఏర్పాట్లను పూర్తి చేశారు. స్వామివారిని దర్శించి కోరుకుంటే వచ్చే ఏడాది జాతర సమయానికి తీరడంతో తిరిగి భక్తులు వచ్చి మొక్కులు సమర్పించుకుంటారని నమ్మకం.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సోమవారం నుంచి ఆరవ తేదీ వరకు బ్రహ్మోత్సవాల చేపట్టనున్నారు. సోమవారం మహాద్వారం నుంచి భజనలతో పల్లకీసేవతో ప్రారంభమై, కృష్ణానది నుంచి తెచ్చిన నీళ్లతో అభిషేకించి ఉత్సవాలు ప్రారంభిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రభోత్సవం, మంగళవారం ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం, బుధవారం సాయంత్రం పాల ఉట్లు, గురువారం రుద్రాభిషేకం, గరుడ వాహన సేవ చేపడుతారు.

ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది

» మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


బీమా చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్తకు తమ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని విఠలాపూర్ చెందిన గుట్టలి గోపాల్ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పేరిట గతంలో బీఆర్ఎస్ పార్టీ బీమా సభ్యత్వం కలిగి ఉండడంతో మంజూరైన రూ.2లక్షల చెక్కును ఆదివారం బాపన్‌పల్లి మాజీ సర్పంచు తిప్పన్న గృహంలో వారి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సుభాష్, బక్క నర్సప్ప, దామోదర్‌రెడ్డి, తిప్పన్న, గురునాథ్‌గౌడ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతులు


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి

దామరగిద్ద, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో 25 మంది విద్యార్థులకు గురుకుల పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరికి ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రత్యేక పాఠాలు బోధిస్తున్నారు. పరీక్ష ఈ నెల 23న ఉన్నందున ఉత్తమ ఫలితాలతో గురుకులకు ఎంపిక కావాలని ప్రతి ఆదివారం సైతం పాఠాలు బోధిస్తున్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


మాగనూరులో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మాగనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. కృష్ణ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు ఏబీసీడీ వర్గీకరణ తక్షణమే అమలు కోసం చేపట్టిన సభ విజయవంతం చేయా లన్నారు. కార్యక్రమానికి మాదిగ ఉపకులాల ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, ఆనంద్, దినేష్, వాబయ్య, కావలి మొగులప్ప, అనిల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నర్వ: ఈ నెల 7న ఇంటికో డప్పుతో మాదిగ కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో పోస్టర్లు ఆవిష్కరించారు. వెంకటయ్య, దండు అయ్యప్ప, పెద్ద మారెప్ప, కురుమూర్తి, నర్సింహ పాల్గొన్నారు

కన్మనూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కన్మనూర్‌లో ఒకే చోట కలిసి పూర్వ విద్యార్థులు

మరికల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్మనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు తమ గురించి చెప్పుకుంటూ.. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కష్టకాలంలో స్నేహితులంగా ఐక్యంగా ఉండి సహాయపడాలని నిర్ణయించారు.

వృథాగా వైకుంఠ ధామాలు


లక్కర్‌దొడ్డిలో వైకుంఠధామంలో వృథాగా ఉన్న స్నానాల గదులు

» నిర్మించి వదిలేసిన అధికారులు

» సెగ్రిగేషన్ షెడ్లు వినియోగించని వైనం

నర్వ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు వృథాగా దర్శన మిస్తున్నాయి. రూ. తొమ్మిది లక్షతో గ్రామాల శివారులో ఈ షెడ్లను నిర్మించారు. వైకుంఠధామాల వద్ద నిర్మించిన స్నానపు గదులు, తలుపులు లేకుండా ఖాళీగా దర్శన మిస్తున్నాయి. జంగం రెడ్డిపల్లె, కొత్తపల్లె, రాయికోడ్, ఉందేకోడ్‌లో గ్రామాలకు దూరంగా నిర్మిం చడంతో అవి ప్రస్తుతం అసాంఘిక కార్యకలా పాలకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం అనుకున్న ట్లు తడి, పొడిచెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయిస్తే పంచాయతీకి నిధులు సమకూరే అవకాశం ఉంది.